# సూటి కేసులతో వచ్చే వారిని తిప్పి పంపించాలి

- బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- మందమర్రిలో కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో చేరికలు
- పటాకులు కాల్చి, బతుకమ్మలతో విప్ సుమన్‌కు స్వాగతం పలికిన మహిళలు

మందమర్రి, నవంబర్ 22: సూటు బూటు వేసుకుని సూటు కేసులతో ఓట్ల కోసం వచ్చిన నాయకులను తిప్పి పంపించాలని బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ యువకులకు, ప్రజలకు పిలుపు నిచ్చారు. మందమర్రి పట్టణంలోని కేకే 1 సీఎస్‌పీ రోడ్డు, ఫిల్టర్ బెడ్ ఏరియా, బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద బుధవారం భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నుంచి యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి విప్ సుమన్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద నిర్వహించిన యువత ఆత్మీయ సమ్మేళనం, ఫిల్టర్ బెడ్ ఏరియా, సీఎస్‌పీ రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఐదేండ్లలో నియోజక వర్గం దిక్కు కన్నెత్తి చూడని నాయకులు ఎన్నికలు రాగానే నోట్ల కట్టలతో వచ్చి నాయకులను కొనుగోలు చేస్తూ ప్రయోజన పొందాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వారు ప్రజల అవసరాలు తీర్చడానికి రాలేదని, వారి అవసరం తీర్చుకుని వెళ్లడానికి వచ్చారన్నారు. గతంలో అధికారం ఇస్తే ఏం వెలగబెట్టారని ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై ఏ మాత్రం పట్టింపు లేని నాయకులు మాయ మాటలతో మోసం చేసేందుకు చూస్తే ప్రజలు ఊరుకోరనిఅన్నారు. వారి మోసాన్ని పసిగట్టిన యువకులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి అనేక మంది పార్టీలోకి వస్తున్నారని అన్నారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు యువకులు, మహిళలు, ప్రజలు తీవ్రంగా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, రాష్ట్రంలో వచ్చిన మార్పును ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మందమర్రిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్.



చెన్నూర్‌లో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



కోటపల్లి : కొల్లూరులో ప్రచారంచేస్తున్న ఓయూ జేఏసీ నాయకులు, మండల నాయకులు

## 'అన్నా.. నా ఓటు నీకే..'



బీఆర్ఎస్ అభ్యర్థి, విప్ బాల్క సుమన్‌తో మాట్లాడుతున్న దివ్యాంగుడు శ్రావణ్

మందమర్రి, నవంబర్ 22:అన్నా నేను బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న నా ఓటు నా కుటుంబ సభ్యుల ఓట్లు కారు గుర్తుకు వేసి నీ గెలుపునకు కృషి చేస్తానని మందమర్రి పట్టణంలోని ఒకటవ జోన్ కాలనీకి చెందిన జనగామ శ్రావన్ అనే దివ్యాంగుడు బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, విప్ బాల్క సుమన్‌తో అన్నారు. స్థానిక బీఆర్ఎస్ బీ1 కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన యువత ఆత్మీయ సమ్మేళనంలో శ్రావన్ విప్ సుమన్‌ను కలిసి తన మద్దతు ప్రకటించారు. తాను కూడా సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటున్నానని అందుకు పలు సంస్థలు అవార్డులు ఇచ్చి ప్రశంసా పత్రాలు ఇచ్చారని తెలిపారు. ఓయూలో పీజీ చేశానని మీరంటే ఎంతో అభిమానమని తెలిపాడు. శ్రావన్‌ను అభినందించిన విప్ సుమన్ నేను గెలిచిన అనంతరం బ్యాటరీతో నడిచే సైకిల్ కొనిస్తానని నీవు చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

**ఇంటింటికీ చెన్నూర్ ప్రగతి ప్రస్థానంతో ప్రచారం..**

కోటపల్లి, నవంబర్ 22 : ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఐదేళ్ల పాలనలో చెన్నూర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చెన్నూర్ ప్రగతి ప్రస్థానం పుస్తకం ముద్రించగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ పంచుతున్నారు. బాల్క సుమన్ ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని ఈ పుస్తకంలో ఫొటోలతో సమగ్ర సమాచారంతో ముద్రించారు. నాడు–నేడు, నూతనంగా నిర్మించిన రోడ్లు, బ్రిడ్జిలు, రైతన్నలకు తెలంగాణ ప్రభుత్వం చేసిన మేలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై దేవులవాడ, బబ్బెరచెలుక గ్రామాల్లో పంచారు.

**కొల్లూరులో..**మండలంలోని కొల్లూరులో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, మండల నాయకులు బైరి సమ్మాగౌడ్, దుర్గం కృష్ణదాస్, జాడి సారయ్య ఆధ్వర్యంలో, సిర్సా గ్రామంలో సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్, జనగామలో ఎంపీటీసీ మారిశెట్టి తిరుపతి, మల్లంపేటలో సర్పంచ్ అక్కల మధూకర్, సర్వాయిపేటలో సర్పంచ్ పసునూటి వసంత కుమారి ఆధ్వర్యంలో ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి బాల్క సుమన్ చేసిన కృషిని వివరించారు.

**చెన్నూర్‌లో..**

చెన్నూర్, నవంబర్ 22: చెన్నూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ తీశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, వేల్పుల సుధాకర్, రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీను, జోడు శంకర్, దోమకొండ అనిల్, తుమ్మ రమేశ్, వేముల శారద, మేడ స్రవంతి. మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, జాడి తిరుపతి, నాయిని సతీశ్, ఆరీఫ్, మేడ సురేశ్‌రెడ్డి, పెండ్యాల లక్ష్మణ్, వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో, ర్యాలీలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**ధర్మారం టూ కొత్తపల్లి కి బైక్ ర్యాలీ**

**- 2 వేల మంది బీఆర్ఎస్ నాయకులతో బైక్ ర్యాలీ**

భీమారం, నవంబర్ 22 : భీమారం మండలంలోని ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు భీమారం మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ నుంచి కొత్తపల్లి గ్రామ పంచాయతీ వరకు బుధవారం బైక్ ర్యాలీ తీశారు. 40 కిలో మీటర్ల మేర ఈ బైక్ ర్యాలీ నిర్వహించగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తమరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్ కుమార్ మాట్లాడుతూ...బాల్క సుమన్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. సుమన్ భారీ మెజార్టీతో గెలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూర్ మండలంలో..**

చెన్నూర్ రూరల్, నవంబర్ 22: మండలంలో జడ్పీటీసీ మోతె తిరుపతి, ఎంపీపీ మంత్రి బాపు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. 40 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో గాని, బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లాల ఓదెలుతో కాని చెన్నూర్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని పేర్కొన్నారు. బాల్క సుమన్ ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి సుమారుగా చెన్నూర్ నియోజకవర్గానికి రూ. 2 వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశాడని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎక్కడి అభివృద్ధి అక్కడే ఆగిపోతుందని, రైతులకు, వ్యాపారులకు ప్రతి ఒక్కరికీ మళ్లీ కష్టాలు తప్పవని యువకులు, రైతులకు వివరించారు. కార్యక్రమం లో సర్పంచు కుక్కడపు నరేందర్, అన్నల మానస తిరుపతి, చెడెంక పున్నం, బుర్ర రాకేశ్ గౌడ్, అయిత పార్వతి, మడక స్వప్న, మాడ సుమలత, పెద్దింటి స్వరూప, ముత్యాల మౌనిక, పాగె రాజమల్లు, ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి సత్యనారాయణ, చెరుకు తిరుపతి రెడ్డి, నాయకులు అయిత సురేశ్ రెడ్డి, మాడ మాధవ రెడ్డి, తుపాకుల సంతోష్, తాళ్లపెల్లి కిరణ్ గౌడ్ తదితరులున్నారు.



భీమారంయ : బైక్ ర్యాలీ తీస్తున్న నాయకులు, కార్యకర్తలు

**మందమర్రిలో వాడవాడలా బీఆర్ఎస్ ప్రచారం.**

మందమర్రి, నవంబర్ 22: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు వాడవాడలా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, శాంతినగర్, పాత బస్టాండ్ ఏరియా, రామన్ కాలనీ, విద్యానగర్, పాలచెట్టు ఏరియా, ప్రాణహిత కాలనీ, శ్రీపతినగర్, దీపక్‌నగర్, ఊరు రామకృష్ణాపూర్, ఊరు మందమర్రి, యాపల్, అంగడిబజార్, అబ్రహం నగర్ తదితర కాలనీల్లో బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు బుధవారం ర్యాలీలు చేస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలపరచి, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను భా రీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, మహిళా నాయకురాళ్లు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

జైపూర్, నవంబర్ 22: మండలకేంద్రంతో పాటు మండలంలోని రామారావుపేట, టేకుమట్ల, శెట్‌పల్లి, పెగడపల్లి, నర్వ, ముదిగుంట, మిట్టపల్లి గ్రామాల్లో బీర్ఆఎస్ నాయకులు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. సూటుకేసులతో వచ్చే లీడర్లను ఓడగొట్టాలని, అభివృద్ధి చేసిన బాల్క సుమన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**మందమర్రి మండలంలో..**

మందమర్రి రురల్ నవంబర్ 22: చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి,ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ని మరోసారి ఆశీర్వదించాలని స్థానిక నాయకులు వైస్ ఎంపీపీ లౌడం రాజ్ కుమార్, సర్పంచ్ తిరుపతి రెడ్డి కోరారు. బుధవారం మందమర్రి మండలంలోని అందుగులపేట్‌లో ఇంటింటికీ తిరుగుతూ బాల్క సుమన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి ఓటేస్తే అభివృద్ధి ఆగిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్ రూరల్ : సోమన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



జైపూర్ :రామారావుపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మందమర్రి : గాంధీ నగర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం